క్లుప్తంగా...

మంత్రిని కలిసిన జిల్లా సాధనసమితి నాయకులు



మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న నేతలు

మేడ్చల్: మేడ్చల్ జిల్లా సాధన సమితి నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో పాల్గొనాలని మంత్రి మల్లారెడ్డిని సమితి నాయకులు కలిశారు. మంత్రి నివాసానికి వెళ్ళి ఉత్సవాలలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాజశేఖర్ రెడ్డి ని వారి నివాసాలలో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించారు.

నేడు రాంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

కీసర: రాంపల్లినుండి చర్లపల్లి, రాంపల్లినుండి కరీంగూడ ఓఆర్ఆర్ వరకు గల కరహదారి మరమ్మత్తుపనులను చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్న బీఆర్ఎస్‌ప్రభుత్వం తీరుకు నిరసనగా ఆదివారం రాంపల్లి కూడలివద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ నేతలు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

విద్యార్థులు కంపెనీ వ్యవస్థాపకులుగా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

ఘట్‌కేసర్: విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా కంపెనీ వ్యవస్థాపకులుగా ఎదగాలని ఈఏఐఈఎస్‌బీ డైరెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన మిడిల్ వేర్ మీటప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచుకొని ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ జనార్దన్ రాజు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

మేడ్చల్: పైప్‌లైన్ లీకేజీ లు కావడం మరమ్మత్తులు చేయకపోవడంతో మేడ్చల్ పట్టణంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో పార్క్ సమీపంలో వాల్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కావడంతో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే గోదావరి నీరు వృథాగా పోతుంది. మూడు రోజుల నుండి పైప్‌లైన్ లీకవడంతో నీరు ఎగిసి పడి రోడ్లపై ప్రవహిస్తోంది.





పైప్‌లైన్ లీకై ఎగిసిపడుతున్న గోదావరి నీరు

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించొద్దు



బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించొద్దని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో రూ. 12 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీటీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్ రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, నాయకులు ప్రణయ్‌రెడ్డి, సిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న ఎస్వైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు యాదిరెడ్డి

పోచారం: ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు కలెక్టరు స్థాయికి ఎదగాలని ఎస్వైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి ఆకాంక్షించారు. శనివారం పోచారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, ప్లేటులు, ఇతర స్టేషనరీ సామాగ్రిని ఫౌండేషన్ తరపున ఆయన అందజేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్న సందర్భాలు చాలానే ఉన్నాయన్నారు. లక్ష్య సాధన దిశగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు

ఘట్‌కేసర్: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) చైర్మన్ డాక్టర్ ఎన్ గౌతం రావు, కార్యదర్శి డాక్టర్ జి మనోహర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ గండిమైసమ్మలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో రెండో స్థానలో నిలిచిన వీబీఐటీ కళాశాల కబడ్డీ జట్టును కళాశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

మేడ్చల్: భూములు కొనుగోలు చేసిన, ఆస్తి మార్పిడి చేసుకున్న రైతులు రైతు బంధు సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి కోరారు. ఈ సంవత్సరం జూన్ 16 వరకు భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమ గ్రామాల పరిధిలో ఏఈఓలను కలిసి తమ పాసుపుస్తకాలను ,ఆధార్‌కార్డు , బ్యాంక్ పాసుపుస్తకం,దరఖాస్తు ఫారంతో కలిపి ఇవ్వాలని ఆమె కోరారు.

ఘనంగా కోటి కుంకుమార్చన



కీసర: నాగారం మున్సిపాలిటీ 15వ వార్డులోని ఈస్ట్‌గాంధీనగర్‌లోగల శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రమణ్య స్వామిదేవాలయంలో ఘనంగా కోటి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వామివారికి డీఎస్పీ ప్రత్యేక పూజలు



కీసర: కీసరలో గతంలో సీఐగా విధులు నిర్వహించి డీఎస్పీగా పదోన్నతి పొందిన నరేందర్‌గౌడ్ కుటుంబసమేతంగా శనివారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిదేవస్థానం, చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామిసేవలో పాల్గొన్నారు. ఆలయ చైర్మెన్లు తటాకం రమేష్, మల్లారపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రిస్టియన్ శ్మశాన వాటికకు భూమి కేటాయింపు



ప్రొసీడింగ్ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని క్రిస్టియన్ శ్మశాన వాటిక కోసం ఎకరం భూమి కేటాయింపు ప్రొసిడింగ్‌ను మంత్రి మల్లారెడ్డి క్రిస్టియన్ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలు అరుణకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు అనురాధా, ఆంజనేయులుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు షౌరత్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అన్నూభాయ్, నరేశ్‌గౌడ్, సిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి మెహదీపట్నంకు ఆర్టీసీ బస్సులు

మేడ్చల్: ప్రయాణికుల సౌకర్యార్థం మేడ్చల్ నుండి మెహదీపట్నం వరకు నూతన బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్‌తెలిపారు. మేడ్చల్ నుండి బోయిన్‌పల్లి, ప్యారడైజ్, బేగంపేట్, పంజాగుట్ట, బంజారాహిల్స్ మీదుగా మెహదీపట్నం వరకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సోమవారం నుండి నూతన రూట్ లో బస్సులు ప్రారంభమవుతాయన్నారు. మేడ్చల్ నుండి ఉదయం 6.40 గంటల నుంచి సాయంత్రం 7.20 గంటల వరకు బస్సులు తిరుగుతాయన్నారు. మెహదీపట్నం నుండి ఉదయం 8.20 గంటలనుండి రాత్రి 9.05 వరకు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మంత్రి



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం సహయనిధి నుండి మంజూరైన ఆర్థిక సహయం చెక్కును మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు.మండలంలోని నూతన్‌కల్ గ్రామానికి చెందిన హరీస్‌యాదవ్ రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సీఎం సహయనిధి నుండి మంజూరైన రూ.లక్షా 50వేల ఆ చెక్కును మంత్రి మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత జీవన్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ



నాగారంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

కీసర: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో సర్దార్ వల్లబాయ్ పటేల్‌శక్తి కేంద్రం ఇంచార్జ్ చీర్యాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. చీర్యాల గ్రామంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు కోలమల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శక్తికేంద్రం ఇంచార్జ్ చిందం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.